క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర



జగపతినగరంలో పైడితల్లి అమ్మవారి బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

కిర్లంపూడి: జగపతినగరంలో ఉన్న శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఉపవాసం ఆచరించిన మహిళా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు నెత్తున పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించారు. ఆలయ వద్ద బుధవారం రాత్రి జాగారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 5న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ప్రెసిడెంట్ కర్రి ప్రసాద్, కర్రి సూర్యకుమార్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



యూటీఎఫ్ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమగ్ర శిక్ష సొసైటీ సహిత విద్యా విభాగం(భవితకేంద్రం)(ఐఈఆర్‌పీ)లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం యూటీఎఫ్ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుల రెన్యూవల్‌లో కొత్త నిబంధన తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏటా రెన్యూవల్ చేసే విధానంలో గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని నిబంధనలు విధించారన్నారు. దీని ద్వారా ఉద్యోగ భద్రత ఉండదన్నారు. ఇతర విభాగాల వారికి ఈ నిబంధన పెట్టలేదని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు వాణిపద్మజ, పి.బుజ్జి యూటీఎఫ్ నాయకులు ఎస్.వీరబాబు, జేసోమరాజు, జి.సుందరరావు, జి.గణపతిరావు, సంజీవ్, ఆదివిష్ణు పాల్గొన్నారు.

అర్హులందరికీ సీసీఆర్సీ కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు హామీ పత్రం(సీసీఆర్సీ కార్డులు) అందేలా చూడాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ సూచించారు. స్థానిక తన కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ అధ్యక్షతన బుధవారం వీఆర్వో, వీఏఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 1702 మందికి కౌలు కార్డులు అందిచాల్సి ఉండగా ఇప్పటి వరకూ 1442 మందికి కార్డులు అందజేశామన్నారు. మిగిలిన 260 కార్డుల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 15,700 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి పంట నమోదు చేయాల్సి ఉండగా 9 వేల ఎకరాల్లో నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. పంట నమోదులో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తుని రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి పీజేసీజే మేజిస్ట్రేట్ రూ.80 వేలు జరిమాన విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి బుధవారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చమన్నారు. ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున ఎనిమిది మందికి రూ.80 వేలు జరిమానా విధించినట్టు ఎస్సై వివరించారు.

ఆరుగురికి రూ.10 వేల జరిమానా

కోటనందూరు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి కోర్టు రూ. 10 వేల జరిమాన, ఒక్కరోజు సామాజిక సేవ శిక్ష విధించినట్లు ఎస్సై టీ రామకృష్ణ బుధవారం తెలిపారు. మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా మద్యం తాగిన ఆరుగురిపై కేసు నమోదు చేసి తుని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా పై శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: కమ్యూనిటీ పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జగ్గంపేటలో క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాకినాడ మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ ర్యాలీలో స్థానిక షాదీఖానా నుంచి మొయిన్‌రోడ్డు మీదగా కొనసాగింది. పీఎంపీల మండల అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ భాష అధ్యక్షతన జరిగిన సదస్సులో కాన్సర్ వైద్య నిపుణులు పృథ్వీరాజ్, పీఎంపీలు జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.



ప్రవర్తనలో మార్పు రావాలి

ప్రస్తుత సమాజంలో మగవాళ్ల ప్రవర్తన మారాలి. ఆడవారిపై గౌరవం పెరగాలి. భారతదేశంలో స్త్రీని భారతమాతగా భావిస్తాం. అటువంటి స్త్రీని మనమంతా గౌరవించాల్సిన అవసరం ఉంది. మగవాళ్లు తన ఇంట్లో తన అక్కా, చెల్లి, తల్లికి ఇచ్చే గౌరవాన్ని ఇతర స్త్రీలకు ఇవ్వాలి. ఒక ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలి. అప్పుడే ఇంకొక ఘటన జరగకుండా ఉంటుంది. ముందు ప్రభుత్వాల చర్యలు మారాలి.

– డా.జానకీదేవి వైద్యాధికారి సీహెచ్‌సీ, రౌతులపూడి



వైద్యులకు అండగా ఉండాలి

వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లకు తప్పనిసరిగా ప్రభుత్వం అండగా ఉండాలి. పది మందికి ప్రాణం పోసే వృత్తిలో ఉన్న వైద్యులకు ప్రస్తుతం రక్షణ కరువైంది. ఇలాంటి పరిస్థితులో వైద్యులు స్వేచ్ఛగా వైద్యం అందించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అందుకే వైద్యులకు రక్షణ కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సౌమ్యశ్రీ, వైద్యురాలు, పి.మల్లాపురం పీహెచ్‌సీ, శంఖవరం మండలం



పొలంబడి.. రైతుకు రాబడి

- ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన
- సాగు ఖర్చు తగ్గించి పంటల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
- సత్ఫలితాల దిశగా అన్నదాతలు



క్షేత్ర స్థాయిలో రైతులకు ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మారుతున్న సాంకేతికత, వాతావరణంలో మార్పులు అన్ని రంగాలపైనా ప్రభావం చూపుతున్నాయి. వాటికి అనుగుణంగా ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటేనే రాణించి ముందుకెళ్లగలం. లాభాలు ఆర్జించగలం. వ్యవసాయ రంగంలో కూడా అదే ఒరవడి నడుస్తోంది. సాగులో కొత్త విధానాలు అవలంబిస్తేనే మంచి దిగుబడి సాధించవచ్చు. లాభాలు పొందవచ్చు. ఈ దిశగా రైతులను సంసిద్ధులను చేసేందుకు ప్రభుత్వం పొలంబడి, పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పొలం, తోటల్లో పాఠాలకు చెప్పడం వల్ల రైతులు ఆ దిశగా సత్ఫలితాలు పొందుతున్నారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో 49,758 హెక్టార్లలో వరి, ప్రత్తి పంటలను రైతులు ఖరీఫ్ సాగును చేపట్టారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. జూన్ నుంచే రైతులను సన్నద్ధం చేసేందుకు సమావేశాలను నిర్వహించారు. తొలుత సాగు విస్తీర్ణం అంచనా వేసేందుకు, తర్వాత కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలు ఇచ్చేందుకు గ్రామ సభలు నిర్వహించారు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న రైతులకు సస్యరక్షణ, యాజయాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లోనూ పొలం పిలుస్తుంది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గతంలో మండలంలోని ఏదో ఒక గ్రామాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి 30 మంది ఔత్సాహిక రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో నిర్వహిస్తూ 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రతి శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయాధికారి, ఏడీఏ, వ్యవసాయ పరిశోధన సంస్థ, శాస్త్రవేత్తలు, అధికారులతో శిక్షణ ఇస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఆయా మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించేలా కృషి చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

సాగులో అధిక ఎరువులు, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడడంతో విష రసాయన అవశేషాలు ఆహార పదార్థాల్లో ఉండిపోతున్నాయి. వీటి వినియోగంతో రోగాలు వస్తున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వీటిని నివారించేందుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ ప్రకృతి పద్ధతులతో భూసారాన్ని పెంచడంతోపాటు ఆరోగ్య కరమైన పంటలు పండించే అవసరాలను తెలియజేస్తున్నారు.



ఒమ్మంగిలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెరుగైన సేవలు

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనతో పాటు, ఎరువులు, నీటి యాజమాన్యపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా వ్యవసాయాధికారులు ప్రతి వారం ఎంపిక చేసిన గ్రామాల్లో పొలంబడి నిర్వహిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో సేద్యంపై శిక్షణ ఇస్తున్నారు. మిశ్రమ ఎరువుల వినియోగం, సూటి ఎరువుల వినియోగాన్ని పెంచడం, సేంద్రియ వ్యవసాయం, శత్రు, మిత్ర పురుగుల గుర్తింపు, ఆధునిక పద్ధతిలో పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు బ్యాటిల్ బాక్స్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆరోగ్యకర పంటలను పండించడం, అన్నదాతలను సాగులో నిష్ణాతులను చేయడం, మిత్ర పురుగులను సంరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు వీటికి నేతృత్వం వహిస్తున్నారు.

ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల పరిధిలో సాగు వివరాలు

మండలం	వరి (హెక్టార్లలో)	ఆర్బీకేలు
తుని	6,600	24
కోటనందూరు	9,575	5
తొండంగి	13,605	26
రౌతులపూడి	5273	17
శంఖవరం	3,605	16
ప్రత్తిపాడు	4,400	26
ఏలేశ్వరం	6,700	15
మొత్తం	49,758	127

తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి



నూతన యాజమాన్య పద్ధతులను తెలుసుకునేందుకు రైతులందరూ ఆసక్తి చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేను పరిస్థితిని అంచనా వేయడంతో పాటు కొత్తగా ఎమైనా తెగుళ్లు ఆశిస్తే వాటిని నివారంచే విధానాన్ని తెలియజేస్తున్నాం. సాగు ఖర్చు తగ్గించి పంట దిగుబడిని పెంచడమే లక్ష్యంగా వీటిని నిర్వహిస్తున్నాం.

– వై.గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు

గురుకులంలో వసతులు మెరుగు పరచాలి



వినతిపత్రం అందజేస్తున్న పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వసతులు మెరుగుపరచాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పరిషత్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో విద్యార్థినులు అస్వస్థత గురికావడంపై కారణాలు తెలపాలన్నారు. పాఠశాలలో భోజనశాలతో పాటు తాగునీరు మెరుగుపరచాలన్నారు. పర్మినెంట్‌గా భోజన వ్యవస్థకు కేర్‌టేకర్‌ను నియమించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ కన్వీనర్ గంగాధర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, స్పార్క్ ప్రతినిధి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు మునసబు గారి రామాలయంలో శ్రీవరసిద్ధి వినాయకుని నవరాత్ర మహోత్సవాలకు బుధవారం రాట మూహూర్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత శింగిలిదేవి సత్తిరాజు, వీరవెంకట అనంతలక్ష్మి దంపతులుచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దిడ్డి వెంకట రమణ, మదినే బాబ్జి, రామాలయ కమిటీ చైర్మన్ మదినే శ్రీను మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాలకు విద్యార్థుల తరలింపు



అనుమతులు లేని హాస్టల్ నుంచి పిల్లలను తరలిస్తున్న అధికారులు

గండేపల్లి/జగ్గంపేట : ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించినట్టు గండేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేశామన్నారు. పి.నాయకంపల్లిలో అవర్ ఫాదర్స్ హోం మినిస్ట్రీస్ పేరుతో అనధికారికంగా ఎటువంటి వసతులు లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని, పిల్లలతో పనులు చేయిస్తున్నట్టు గుర్తించి మొత్తం 12 మంది పిల్లలను జగ్గంపేటలోని హాస్టళ్లకు పంపించామన్నారు. బాలురు 10 మందిని బాలుర వసతి గృహానికి, ఇద్దరి బాలికలను బాలికల వసతి గృహానికి అప్పగించినట్టు ఆయన తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సీడీపీఓ పూర్ణిమ, సూపర్‌వైజర్ నాగ పార్వతి, వీఆర్వో సాయి ప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితురులు ఉన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



తునిలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న త్రైతసిద్ధాంత ప్రభోధ సేవా సమితి ప్రతినిధులు

తుని: స్థానిక త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. స్థానిక కొత్తపేటలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కొలువుదీరిన శ్రీకృష్ణుని ప్రతిమను బుధవారం పురవీధుల్లో భక్తుల కోలాహలం నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. లోక కల్యాణం కోసమే కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించినట్టు త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

మంచినీటి పథకాలకు శంకుస్థాపన

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో రూ 24 లక్షలతో నిర్మించే రక్షిత మంచినీటి పథకానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

గండేపల్లి: జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మండల పరిధి పరిణయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ వైస్ ఎంపీపీ మారిశెట్టి భద్రం, సర్పంచు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీ వ్రతం నిర్వహించే సత్యదేవుని నిత్యకల్యాణ మండపం

అన్నవరం: శ్రావణమాస నాలుగో శుక్రవారం పర్వదినం సందర్భంగా సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు వ్రతం జరుగుతుందని, వ్రతానికి నిత్య కల్యాణ మండపం సరిపోకపోతే వ్రత మండపాలలో కూడా నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వారు తెలిపారు. వ్రతానికి వచ్చే మహిళలు గాజులు, పూలు, అరిటిపళ్లు, రెండు కొబ్బరికాయలు తెచ్చుకోవాలన్నారు. మిగిలిన పూజాద్రవ్యాలన్నీ దేవస్థానమే అందిస్తుందన్నారు. లక్ష్మీదేవి రూపు, తోరం, ప్రసాదం అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

శ్మశాన వాటికను వేరే ప్రాంతానికి మార్చాలని వినతి

- ఇళ్ల మధ్య శ్మశానం..
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



తహసీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

కోటనందూరు: ఇళ్ల మధ్యలో ఉన్న శ్మశానవాటికను వేరే ప్రాంతానికి తరలించాలని కోటనందూరు గ్రామానికి చెందిన బాధితులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు బుధవారం తహసీల్దార్ టి.సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. 2017లో స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో తాండవనది ఒడ్డున 14 మందికి ఇళ్లస్థలాలు కేటాయించారని, వీరిలో కొంతమంది ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని వివరించారు. ప్రస్తుతం ఈ నివాస ప్రాంతానికి అనుకొని నిర్వహిస్తున్న శ్మశానం గతంలో నది అవతల భాగంలో ఉండేదన్నారు. కాలక్రమంలో ఆ శ్మశానాన్ని నది ఇవతల భాగానికి తీసుకురావడంతో ఈ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నామని తహసీల్దార్‌కు వివరించారు. తమకు న్యాయం చేయాలని అక్కడ ఉన్న ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల బాబ్జీ, అంకారెడ్డి రాజాశేషు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం



మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతలపూడి: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయం, ఉద్యానవనశాఖ, పశువైద్యం తదితర శాఖ అధికారులు మాట్లాడి తమ తమ శాఖల పనితీరు గురించి సమావేశంలో వివరించారు. అనంతరం విద్య, వైద్యం, విద్యుత్ వంటి శాఖల గురించి చర్చించారు. ములగపూడి పీహెచ్‌సీలో వైద్యుల, సిబ్బంది పనితీరు బాగో లేదని దీనివల్ల రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదని సర్పంచు తమరాన సత్యనారాయణ సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం సీజన్‌లో గ్రామాల్లో రోగాల సంఖ్య ఎక్కువగా ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు. విద్యుత్ అధికారుల గ్రామాల్లో పర్యటించి ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా మెరుగైన విద్యుత్ సరఫరాను అందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కేవలం సమీక్షలతోనే సరిపెట్టి సమావేశాన్ని మమ అనిపించారు.

ప్రహరీకి శంకుస్థాపన

రూ.20 లక్షల మండల పరిషత్ సాధారణ నిధులతో నిర్మించనున్న మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే వరుపల సత్యప్రభ బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, వాసిరెడ్డి మంగాలక్ష్మి, పలవురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యాన శాఖ, ఏపీ ఆయిల్ఫెడ్ సంయుక్తం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాకు చెందిన రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల దొరబాబు, మదినే దొరబాబు, రీసు సత్తిబాబు, ఏలేశ్వరం, శంఖవరం ఉద్యాన శాఖ అధికారులు ఏ శ్రీవల్లి, పి అరుణ, ఏపీ ఆయిల్ ఫీడ్ అధికారి జగదీశ్వరరావు, ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పూజాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

జగ్గంపేట: గోవిందపురం గ్రామంలో పూజాలమ్మ అమ్మవారి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. ఈమహోత్సవాన్ని అవతార్ వేదానంద సరస్వతీ గురువు గొట్టుముక్కల సూర్యనారాయణ వర్మ చేతుల మీదగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీ తోట నరసింహం తనయుడు తోట రాంజీ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నవీన్ కుమార్ వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పునర్నిర్మించిన గొట్టుముక్కల సూర్యనారాయణవర్మ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికి లభించాలని కోరుతున్నామన్నారు.

అజొల్లాతో పంటకు నత్రజని లభ్యం

గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు

తుని రూరల్: అజొల్లాతో వరి పంటకు అవసరమైన నత్రజని సహజంగా లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. డి.పోలవరంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎకరానికి రెండు కిలోలు అజొల్లాను వేస్తే 15 రోజుల్లో మొత్తం విస్తరిస్తుందన్నారు. అలా విస్తరించిన అజోల్లా గాలిలో ఉండే నత్రజనిని స్వీకరించి నేలలో స్థిరీకరిస్తుందన్నారు. దీంతో రసాయనికంగా తయారు చేసిన నత్రజని పంటకు వాడాల్సిన అవసరం లేదన్నారు. ఏవిధంగా అజొల్లా వేసుకోవాలో క్షేత్రస్థాయిలో రైతులకు డెమో నిర్వహించి చూపించారు. అజోల్లా పశువులకు దాణాగా కూడా ఉపయోగించవచ్చన్నారు. మెట్ట భూములకు, ఆరుతడి పంటలకు అజొల్లాను వినియోగంచకూడదన్నారు. వీపీఏలు, ప్రకృతి సాగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లైన్ వరినాట్లతో వరిపంటలకు మేలు

తొండంగి: ప్రస్తుతం ఖరీఫ్ వరినాట్లు వేస్తున్న నేపథ్యంలో పొలాల్లో లైన్ ఊడుపు వరిపంటలకు మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి ఎం.వెంకట లక్ష్మి అన్నారు. బుధవారం ఎ.కొత్తపల్లిలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిసాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.



ఎ.కొత్తపల్లిలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటలక్ష్మి

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

ఏలేశ్వరం: దోమలను గుర్తించేందుకు పొలాల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బిజ్యోతి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సిరిపురం గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయధికారి బి.జ్యోతి రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ లింగాకర్షక బుట్టలు తెల్లదోమ, నల్లదోమ, పచ్చదోమతో పాటు రకరకాల దోమలను ఆకర్షిస్తాయన్నారు. దీని ద్వారా ఏ దోమల బెడద ఎక్కువగా ఉందో గుర్తించవచ్చన్నారు. గుర్తించి వాటికి క్రిమిసంహార మందులు వాడవచ్చాన్నారు. ఎకరానికి పది బుట్టల చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



డి.పోలవరంలో అజొల్లాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్ కుమార్

రాగి సాగుతో అధిక లాభాలు

శంఖవరం: గుళి పద్ధతిలో రాగి(బోడి) పంట సాగు చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. మండలంలోని ఎస్.జగ్గంపేట గ్రామంలో గుళి పద్ధతిలో రాగి పంట వేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు క్రాంతి, సిబ్బంది ఇ.రామారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కోడిగుడ్ల కొత్త స్టాక్



కోడిగుడ్ల కొత్త స్టాకును పరిశీలిస్తున్న ఎంఈఓ

గండేపల్లి: తాళ్లూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్లు పాడైపోవడంతో మంగళవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన ఎంఈఓ కేహెచ్ నాయక్ బుధవారం స్కూల్‌ను సందర్శించారు. హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, ఎంఈఓ నాయక్ కలిసి కోడిగుడ్ల స్టాక్‌ను పరిశీలించి, స్టాక్ 900 గుడ్లలో 20ని మళ్లీ ఉడికించగా అందులో నాలుగు పాడై దుర్వాసన రావాడాన్ని గమనించారు. వెంటనే వాటిని సరఫరా చేసిన వారికి పంపించి కొత్త స్టాక్‌ను తెప్పించారు. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ నాయక్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

కోటనందూరు: యువకుడిపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సార్‌పేట గ్రామానికి చెందిన కుశిరెడ్డి వీర వెంకట సత్య మణికంఠ నాయుడు పక్క గ్రామమైన భీమవరపుకోట వెళ్లి తిరిగి ఎస్సార్‌పేట వస్తుంటుండగా ఎస్సార్‌పేటకు చెందిన ఆరుగురు వ్యక్తులు రాజకీయ కక్షతో దాడి చేశారు. గాయపడిన మణికంఠ నాయుడిని స్థానికుల సహాయంతో తుని ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వివరించారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో పెరటి తోటల పెంపకంపై బుధవారం మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెరటితోటల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. చిరుధాన్యాల గురించి వివరించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వంద మంది మహిళలకు 12 రకాల పెరటి తోటల విత్తనాలను పంపిణీ చేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, సిబ్బంది లక్ష్మీ, రాధ, వరలక్ష్మి, మణి పాల్గొన్నారు.